# ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

## కథ

-డా. పి.యస్. ప్రకాశరావు

**"ఏదో వంట పనిలో సాయం చెయ్యడం, సామాన్లు సర్దడం వంటివి చెయ్యమంటే చేస్తాను కానీ ఇలాంటి పన్లు మీ లేడీసే చూసుకోవాలోయ్!"**

**"ఏం మీ మగాళ్ళెందుకు చెయ్యకూడదంట ఇలాంటి పన్లు?"**

**"ఎందుకంటే...ఏమో...చెప్పలేను"**

**"చెప్పలేకపోవడానికేముందీ! తరతరాలుగా మీ మగాళ్ళ నరనరానా జీర్ణించుకుపోయిన పురుషాహంకారం"**

''ఇంత చిన్న విషయానికి అంత పెద్ద మాట అవసరమా!''

''ఇది చిన్న విషయమేమీ కాదు. ఎంత చదివినా ఎన్ని ఆదర్శాలు వల్లించినా భర్తల స్వభావం మారలేదని రుజువు చేసే అంశం''

''అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం. పాప సంరక్షణ బాధ్యత అంతా నీమీదే పెట్టి నేనేమీ చెయ్యట్లేదనా?''

''ఆ...! ఎందుకు చెయ్యడం లేదూ! చేస్తున్నారు. పాపకు పాలు పట్టించమంటే పట్టిస్తారు. కానీ అది పాలు కక్కితే నన్ను పిలుస్తారు. పక్కలో పడుకోబెట్టుకుని దాని ముద్దు మాటలకు మురిసిపోతారు. కానీ అది పక్క తడిపితే నేనే వచ్చి పక్క బట్టలు మార్చాలి. బజారంతా తిరిగి గౌన్లు కొని అవి తొడిగి పొంగిపోతారు. కానీ అది గౌను పాడు చేసుకుంటే మాత్రం చీదరించుకుని 'ఏమోయ్! పాప సంగతి కొంచెం చూడు' అంటూ నా కోసం గావుకేకలు పెడతారు టేబులు శుభ్రం చెయ్యలేదని ఆఫీసురు అటెండరు మీద కేకలేసినట్టు''

★ ★ ★

కమల, రమేష్ ఆ జంట పేర్లు. వారి కలల పంట ఆ పాప. వాళ్ళ పెళ్ళై నాలుగేళ్ళు దాటింది. పాప పుట్టి మూడేళ్ళు దాటింది. వాళ్ళ పెళ్ళి అందరిలోనూ జరిగింది. కానీ అందరి పెళ్ళిళ్ళలా జరగలేదు. యూనివర్శిటీ కాంపస్ వాళ్ళ పరిచయానికి బీజం వేస్తే, లైబ్రరీ ఆ బీజం మొక్కలా పెరగడానికి దోహదపడింది. పుస్తకాలూ, సాహితీ సమావేశాలూ ఆ మొక్క మూడు పువ్వులూ, ఆరు కాయలుగా విలసిల్లేలా చేశాయి. శ్రామికుల గురించే కాదు ప్రేమికుల గురించి కూడా చర్చలు జరిగేవి. ఇద్దరిలో ఒక్కరికైనా ఉద్యోగం దొరికే వరకూ ఇద్దరూ ఒక్కటి కాకూడదనుకున్నారు. చదువులు పూర్తయ్యాక కమలకు ఓ ఎయిడెడ్ కాలేజీలోనూ, రమేష్‌కి ఓ ప్రైవేటు కంపెనీలోనూ ఉద్యోగాలు దొరికాయి. వేరు వేరుగా నివసిస్తూ అప్పుడప్పుడు సభల్లోనూ, సమావేశాల్లోనూ, ఫంక్షన్లలోనూ కలుసుకుంటూ గంటల తరబడి చర్చలతోనూ, వాదాల తోనూ గడిపినప్పుడు బైటపడని అభిప్రాయ భేదాలు కలిసి సహజీవనం ప్రారంభించాక బైటపడసాగాయి. వాటిలో ఇది కూడా ఒకటి.

ఎలక్షన్ డ్యూటీ చేసి అలసిపోయి రెండు రోజుల తర్వాత ఇంటికి చేరింది కమల. అలసట, నిద్రలేమి వల్ల తలనొప్పి, నీరసం వచ్చేశాయి. భోజనం కూడా చెయ్యాలనిపించలేదు. స్నానం చేసి కాఫీ తాగి పడుకుంది.

ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళకు ఎలక్షన్ డ్యూటీ పెద్ద శిక్ష. కమలకు మాత్రం ఆ శిక్ష నుంచి మినహాయింపు ఎందుకుంటుంది? ఎక్కడో మారుమూల గ్రామంలో డ్యూటీ. అక్కడ కరెంటు లేదు. శుభ్రమైన తిండి దొరికే హోటళ్ళుండవు. దొరికిందేదో తిని కాలక్షేపం చేద్దామనుకుంటే టాయిలెట్ సౌకర్యాలు లేకపోవడం వల్ల తిన్నది జీర్ణంకాక ఏ సమస్య వస్తుందో అని భయం. కనీసం మంచినీళ్ళు ఎక్కువ తాగాలన్నా భయమే. పోనీ ఆ ఒక్క రాత్రీ చుట్టుపక్కల ఎవరినైనా బతిమాలి వాళ్ళ బాత్రూం ఉపయోగించుకుందామనుకుంటే కులం, గోత్రం వగైరా సవాలక్ష ప్రశ్నలు ఎదురవుతాయి. దానికి తోడు ఆ ఇళ్ళలోని మగాళ్ళ వెకిలిచూపులు. ఈ సమస్యల చికాకుల్లో ఉంటే ఎలక్షన్లో ఫ్రీగా దొరికిన నాటుసారా తాగి ఎవరొచ్చి గందరగోళం చేస్తారో అని మానసిక ఆందోళన మరోవైపు. ఈ సమస్యలన్నీ ముందుగానే ఎవరో చెప్పగా విన్న కమల డ్యూటీ ఆర్డరు తీసుకోనని నిర్ద్వంద్వంగా చెప్పింది. కానీ ''ఇవి కలెక్టర్ ఆర్డర్సమ్మా! కాదంటే మీకే లేని పోని సమస్యలు. పైగా ఉద్యోగంలో కొత్తగా చేరినట్టున్నారు. ఆలోచించుకోండి'' అన్నాడు ఆ ఆర్డర్లు తెచ్చిన వ్యక్తి. అందరూ లోపల సణుక్కుంటూనే మౌనంగా ఆర్డర్లు తీసుకుంటూ ఎందుకు సంతకాలు పెడుతున్నారో అప్పుడర్థమైంది కమలకి. తను కూడా నలుగురితో నారాయణా అనక తప్పలేదు. ఏదో విధంగా ముళ్ళ మీద ఉన్నట్టు రెండ్రోజులూ గడిపేసి డ్యూటీ పూర్తయిందనిపించేసరికి తలప్రాణం తోకకి వచ్చినంత పనయిందామెకి. ఇల్లు చేరుకుని విశ్రాంతి తీసుకుందామనుకుంటే రాత్రి 12.30కి పాప లెట్రిన్ కెళ్తుందట తీసుకెళ్ళమని రమేష్ కమలని లేపడంతో వాదన మొదలయ్యింది. అదీ సమస్య. కమలే పాపని తీసుకెళ్ళడం, తీసుకురావడం, నిద్ర పుచ్చడం కూడా అయిపోయింది. కానీ వాదన మాత్రం కొనసాగుతూనే ఉంది.

''అంటే అందరు భర్తల్లాగే నేనూ ప్రవర్తిస్తున్నానంటావా? కిరాణా, కూరలు తేవడం వంటి బైట పన్లన్నీ నేను చేయట్లేదా? అప్పుడప్పుడు ఇంటి పనుల్లో నీకు సాయపడ్డం లేదా!''

ఆమె వాదాన్ని తిప్పికొట్టడానికి తనకో పాయింటు దొరికిందని దాన్ని ప్రయోగించేశాడు కానీ సాయంత్రాలు ఎక్కువగా స్నేహితులనీ, షికార్లనీ బైట తిరిగి రాత్రి ఏ పది గంటలకో ఇల్లు చేరుతాననే విషయం అతనికి గుర్తులేకపోలేదు.

''ఆగండాగండి. మీరు బైటకెళ్ళి చేసే పన్లన్నీ నేనూ చేయగలను. కాకపోతే ఆటోలకి పది రూపాయలు ఖర్చవుతాయంతే''

''నేను కాదనడం లేదు. కానీ ఇలాంటి పనులు చెయ్యలేనని అంటున్నాను''


''అంటే అందరు మగాళ్ళలాగే మీకు కూడా ఆడపనులు వేరు, మగ పనులు వేరు అనే పురాతన అభిప్రాయాలే ఉన్నాయన్నమాట''

''ఏమో! నువ్వెలా అనుకున్నాసరే!'' అంటూ శరీరంతోపాటు సంభాషణకి కూడా ముసుగేసేశాడు. ఆమె చేసే నిశిత విమర్శకు తట్టుకోలేనప్పుడు చేసే వాదనను అర్థాంతరంగా ముగించేయడం అతనికి అలవాటే. ఆ సంగతి తెలిసి కూడా అతనితో అంతసేపు వాదించడం తన తప్పే అనుకుంది. నిద్ర ఎగిరిపోయి, తగ్గుతోందనుకున్న తలనొప్పి ఎక్కువయింది.

రమేష్‌తో జీవితం ప్రారంభించాక ఇలాంటి సంఘటనలు తనకి రెండు మూడు ఎదురయ్యాయి.

పెళ్ళైన కొత్తల్లో జరిగిన సంఘటన ఇప్పటికీ తన కళ్ళముందు కదలాడుతోంది. ఆమె

అత్తగారు కొడుకును చూడాలని పల్లెటూరు నుంచి వచ్చింది. కానీ కట్నం తీసుకోకుండా, ఓ అచ్చటా ముచ్చటా లేకుండా రిజిస్టర్ పెళ్ళి చేసుకున్నాడని సంవత్సరం దాకా కొడుకు ముఖం చూడలేదావిడ. చివరికి ఉండబట్టలేక తనంతతానే వచ్చింది. కోడలు ఆప్యాయంగా పలకరించడం, తన అవసరాలన్నీ దగ్గరుండి తీర్చడం చూసి ''ఫరవాలేదు. కట్న కానుకలు లేకపోయినా నా కోడలు మంచిపిల్లే'' అని సరిపె



ట్టుకుంది. కానీ ఒక్క విషయం మాత్రం పర మాన్నంలో పంటి కింద రాయిలా తగిలిందావి డకి. ''భర్తను పేరుపెట్టి పిలుస్తోందేవిటీ! పోనీలే! ప్రేమ పెళ్ళికదా! అలవాటేమో! కాలక్ర మంగా మార్చుకుంటుందిలే!'' అని మొదట సరిపెట్టుకుంది. కానీ రోజులు గడుస్తున్నా పని మనిషి ముందూ, ఇంటికొచ్చిన బంధుమిత్రుల ముందు కూడా అలాగే పిలుస్తుంటే సహించలేక పోయింది. తన బాధనంతా కొడుకు ముందు వెళ్ళగక్కింది. రమేష్ కమలకు నచ్చజెప్పాలని ప్రయత్నించాడు. ఆమె ససేమిరా అంది.

''ఇంతకాలం నుంచీ లేని అభ్యంతరం ఇప్పు డెందుకొచ్చిందీ! పెళ్ళి కాకముందు సినిమా లకీ, షికార్లకీ, పార్కులకీ, మీటింగులకీ తిరిగాం. స్నేహితుల ఇళ్ళలో జరిగే ఫంక్షన్లకి అటెండయ్యాం. ప్రతి చోటా పేర్లు పెట్టుకునే పిలుచుకున్నాం. అసమానతల సంప్రదా యాన్ని కాదని స్నేహితుల్లా జీవించాలని అనుకున్నాం. ఇప్పుడు కొత్తగా అలవాట్లు మార్చుకోవల సిన అగత్యం ఏం వచ్చిందీ?'' తీవ్రంగానే ప్రశ్నించింది కమల.

''అది కాదు కమలా! కొంచెం నేను చెప్పేది విను. మా అమ్మ పాతకాలం మనిషి. కులాం తర వివాహం, ప్రేమ వివాహం వంటి వాటిని అంగీకరించేంత వరకూ వచ్చింది. కానీ భార్య భర్తను పేరు పెట్టి పిలవడాన్ని జీర్ణించుకోలేకపో తోంది. ఈ వయసులో ఆమెను బాధపెట్టడం ఎందుకు చెప్పు?'' బ్రతిమాలుతున్న ధోర ణిలో అన్నాడు.

''మరి ఈ వయసులో ఆమెను బాధపె ట్టడం ఎందుకు? అనుకున్నప్పుడు కట్నం లేని పెళ్ళెందుకు చేసుకున్నావు? ఈ పెళ్ళి ఆమెని బాధపెట్టేది కాదా? ఆమె అసలు బాధే పడకూ డదనుకుంటే ఆమె ముచ్చట పడినట్టుగా లక్షల కట్నంతో లక్షణంగా పెళ్ళి చేసుకోవచ్చుకదా! చూడు రమేష్! జీవితమంతా పాత సంప్రదా యాలను గౌరవిస్తూ బ్రతికిన వాళ్ళు ఒక్కసా రిగా కొత్త భావాలను అంగీకరించరు. రెండింటి మధ్యా ఘర్షణ తప్పదు. ప్రగతిశీల భావాలను ఆచరణలో పెట్టేవాళ్ళు రాజీపడకుండా ముందుకు సాగితే మీ అమ్మలాంటి వాళ్ళు కూడా నెమ్మదిగా వాటిని అర్థం చేసుకోవడం ప్రారంభిస్తారు. మన పెళ్ళిని ఆమె అంగీకరించే స్థితికి రావడమే దీనికి ఉదాహరణ'' అంది.

రమేష్ దగ్గర దానికి సమాధానం లేదు. పెళ్ళి అనే ప్రధాన సమస్య పరిష్కారమైనప్పుడు చిన్న చిన్న విషయాలలో రాజీపడొచ్చు కదా! అనే ధోరణిలో ఆలోచిస్తున్నాడు. ఆ విషయాన్నే మళ్ళీ చెప్పాడు.


కమలకి చాలా అసహనంగా ఉంది. తేగేదాకా లాగడం ఇష్టంలేక తెగించి చెప్పలేకపోతోంది. ఏ భావజాలానికైతే తాను అతీతంగా ఉండాలను కుందో అదే భావజాలంతో రాజీపడక తప్ప లేదు.

ఎలా గోలా బ్రతి కేద్దాం! అనుకో కుండా 'ఇలాగే బ్రతకాలి' అని కొన్ని సూత్రాలను నిర్దేశించుకుని వాటి ప్రకారం జీవితాన్ని గడపాలనుకునే వాళ్ళు ఒక చోట రాజీపడితే మిగిలిన విషయాల్లో కూడా ఆ రాజీ ధోరణి కొనసాగుతుంది. మొదటిసారి రాజీ పడేటప్పుడు అనుభవించిన మానసిక సంఘర్షణ ఆ తర్వాత పడిన రాజీల్లో ఉండదు. కమల విషయంలో కూడా అదే జరిగింది.

భర్తను పేరుకి బదులు 'ఏమండీ' అని, 'నువ్వు'కి బదులు 'మీరు' అని పిలవడం అలవాటు చేసుకుంది. కానీ ఆ రాజీ ధోరణి అక్కడితో ఆగలేదు. ఈ సంఘటన జరిగి మూడు రోజులు తిరక్కుండానే ''మూడు రోజుల సమస్య'' అత్తాకోడళ్ళ మధ్య తిష్ఠ వేసుక్కూర్చుంది. అత్తగారు చెప్పిన నియమాలు విని కస్సుమంది కమల. కొడుకు దగ్గర మొరపెట్టుకుంది అత్తగారు. కథ మామూలే. కమల వాదించింది. భర్త అభ్యర్థించాడు. కాదు కాదు మరోసారి తన ఆధిక్యతని రుజువు చేసుకున్నాడు. అత్తగారు కొన్నాళ్ళుండి వెళ్ళిపోయినా కమల కొత్త అలవాట్లు స్థిరపడిపోయాయి.

[illegible]దేళ్ళ తర్వాత ఆమెలో అంతర్మథనం ప్రారంభమైంది. రమేష్‌ని జీవిత భాగస్వామిగా ఎంచుకోవడంలో తొందరపడ్డానా? అని తర్కించుకోసాగింది. చిన్నప్పటి నుంచీ కుటుంబంలో వివక్షను ఎదుర్కొంది తను. తల్లీ తండ్రీ అన్నలూ ఎన్నో కట్టుబాట్లు విధించే వారు తన మీద. డిగ్రీ వరకూ వంచిన తల ఎత్తకుండానే చదువుకున్న తాను అధ్యాపకులు, అధ్యయనం కలిగించిన ఆత్మవిశ్వాసం వల్ల తల ఎత్తి డిగ్రీ పూర్తి చేసింది. ఆ మార్పును గమనించిన అన్నలు యూనివర్సిటీ చదువుకి అభ్యంతరం చెప్పారు. మొదటిసారిగా ఎదురు తిరిగి విజయం సాధించింది. తన భవిష్యత్తు ఎలా ఉండాలో అప్పుడే నిర్ణయించుకుంది. ఎలాంటి పురుషాధిక్యతకీ తావులేకుండా చక్కని అభ్యుదయ భావాలున్న యువకుడితోనే జీవితాన్ని పంచుకోవాలనుకుంది. తన కలల సాకారంగా పరిచయమయ్యాడు రమేష్.

సమాజంలో స్త్రీల దుస్థితి గురించీ, పురుషాధిపత్యం గురించీ ఆవేశంగా మాట్లాడేవాడు. రమేష్‌తో పరిచయం స్నేహంగా, స్నేహం ప్రేమగా మారిన సందర్భం ఇప్పటికీ తనకి గుర్తుంది. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంత ఉద్వేగపూరితంగా మాట్లాడాడు. స్త్రీ ఇంట్లో చేసే శ్రమ అనుత్పాదకం అనీ, ఇంటి పనులకే పరిమితమైపోవడం ఆమెను నిరర్థకురాలిగా చేస్తోందనీ, స్త్రీ సంపూర్ణ సమానత్వాన్ని సాధించినప్పుడే ఆమెకు వీటి నుంచి విముక్తి అనీ, ఆవేశంతో ఉపన్యసిస్తుంటే అతన్నెంతో ఆరాధనా భావంతో చూస్తూ తానే ముందుగా చప్పట్లు కొట్టింది. అవన్నీ పై పై కబుర్లేనా! ఆచరణకు వచ్చేసరికి మగాళ్ళంతా ఇంతేనా! పురుషాధిక్యం




కేవలం రూపాన్ని మాత్రమే మార్చుకుందా! కలత చెందిన మనస్సుతో తెలియకుండానే నిద్రలోకి జారిపోయింది.

★ ★ ★

రాత్రి పది దాటుతున్నా రమేష్ ఇంటికి రాలేదు. మీటింగో, స్నేహితులతో కబుర్లో అయ్యుంటాయని సరిపెట్టుకుంది. పది కొండు కావస్తుండగా వచ్చాడు. ఎక్కడెక్కడో తిరిగి వచ్చినట్టు అతని ముఖం చూస్తేనే అర్థమవుతోంది. స్నానం, భోజనం చేసి ''కమలా! నీతో మాట్లాడాలి. డాబా మీద కూర్చుందాం..రా!'' అంటూ ఆమె సమాధానం కోసం ఎదురు చూడకుండా వెళ్ళాడు. అంటే ఏదో చెప్పాలని ప్లాన్ చేస్తున్నాడన్న మాట. ఏమై ఉంటుందీ! సరదాగా కబుర్లు చెప్పుకోడానికో, కొత్త పుస్తకాల గురించి మాట్లాడుకోవడానికో అయ్యుండదు. వాటన్నింటికీ ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. ఆలోచించుకుంటూనే వెళ్ళింది.

''కూర్చో కమలా!...ఏమీలేదు. ఎన్నాళ్ళిలా అద్దె ఇళ్ళలో గడుపుతాం. మనకి కూడా సొంత ఇల్లు ఒకటి ఏర్పాటు చేసుకోవాలి గదా! నా ఫ్రెండ్సంతా ఇదే విషయం చెబుతున్నారు'' అంటూ ఆగాడు.

కమలకి ఆశ్చర్యం వేసింది. 'ఉద్యోగాలు వచ్చినప్పటి నుంచీ డబ్బు కూడబెట్టడం, సొంత ఇల్లు కట్టుకోవడం వంటివే లక్ష్యాలుగా చేసుకుని జీవితాలు యాంత్రికం చేసుకోకూడదని చెప్పిన నువ్వేనా ఇలా మాట్లాడేది?' అనాలనుకుంది. కానీ అనాలనుకున్న మాటల్ని అంతరంగంలోనే అణిచేసుకునే అలవాటు ఎప్పుడో చేసుకుంది. అందుకే మౌనంగా ఉండిపోయింది.

మళ్ళీ తనే చెప్పసాగాడు. ''ఓ ఫ్రెండ్‌కి తెలిసినవాళ్ళ ద్వారా హౌసింగ్ సొసైటీలో జాయిన య్యాను. నీ జీతం ప్రతి నెలా వాయిదాలు కట్టెయ్యాలి. అయిదేళ్ళలో అపార్ట్‌మెంట్ మన సొంతమవుతుంది. అదనంగా ఇతర పేమెంట్లు కూడా ఉంటాయనుకో. అవన్నీ తర్వాత చూసుకుందాం!'' ఆమె ముఖ కవళికలు గమనించడానికన్నట్టు ఆగాడు. కానీ ఆమె ముఖం నిర్వికారంగా ఉంది.

''కాబట్టి నువ్వు ఖర్చుల విషయంలో కొంచెం జాగ్రత్తగా ఉండాలి''

'మనం కాదన్నమాట' అనుకుంది కమల.

''చీరలనీ, పుస్తకాలనీ, సాహిత్య పత్రికలకి చందాలనీ, పేద విద్యార్థులకి ఫీజులనీ డబ్బు వృథా చేయొద్దు. నీ బస్సు ఖర్చులకీ, ఆటో ఛార్జీలకీ నేనెలాగూ డబ్బులు ఇస్తాను కదా!''

చివుక్కుమంది మనసు. తనతో సంప్రదించకుండా సొసైటీలో జాయినైనందుకు కోపం వచ్చినా ఊరుకుంది. ఇల్లు అవసరమే. కానీ ఉద్యోగాలు వచ్చి రెండు మూడేళ్ళు కాకుండానే సర్వశక్తులూ డబ్బు కూడబెట్టడానికే వినియోగించడం, కనీసం అనుభూతులు కూడా దూరం చేసుకోవడం తనకి బాధ కలిగించే విషయాలు. అతనితో వాదించి ప్రయోజనం లేదు.

★ ★ ★

రాత్రి ఏడున్నర కావస్తోంది. కొలీగ్ కూతురి బర్త్‌డే ఫంక్షన్‌కి హాజరై ఆలస్యంగా ఇంటికి వచ్చిన కమలకి ఇంటి ముందు స్కూటర్లూ, గుమ్మం ముందు మూడు జతల కొత్త జోళ్ళూ కన్పించాయి. తను ఆలస్యంగా వస్తానని ముందే చెప్పడం వల్ల పాప దగ్గర రమేష్‌ని ఉండమంది. పగలంతా పాపను సంరక్షించే పనమ్మాయి కూడా వెళ్ళిపోతుంది. మరి ఎవరు వచ్చి ఉంటారు?...ఎవరో ఉపన్యాసధోరణిలో మాట్లాడుతున్నారు. సందేహం లేదు. అది రమేష్ గొంతే.

''మగడు వేల్పన పాత మాటది. ప్రాణమిత్రుడ నీకు..అని ఏనాడో గురజాడ చెప్పాడు. కాబట్టి..'' ఆవేశంగా ఫ్రెండ్స్‌తో చెబుతున్నాడు రమేష్.

అదే ఆవేశం..అదే మాటల ప్రవాహం..ఆ మాటలకే తానానాడు మురిసిపోయింది.

చిత్రం! ఆ మాటలిప్పుడు ఆమెలో ఎలాంటి అనుభూతులూ కలిగించడం లేదు. ఒక్కసారిగా పెదాలపై చిరునవ్వు ప్రత్యక్షమైంది. కానీ ఆమెకి మాత్రమే తెలిసిన నిజం అది వైరాగ్యంతో కూడిన నవ్వని.

☆